భారత్‌లో కొలువుల కోతలు ఎక్కువగా జరిగిన టెక్ కంపెనీలు

2022లో		2023లో	
కంపెనీ	ఉద్యోగాల కోతలు	కంపెనీ	ఉద్యోగాల కోతలు
బైజూస్	2,500	బైజూస్	2,500
అన్‌అకాడమీ	1,500	పేటీఎమ్	1,000
ఓలా	1,200	రిలయన్స్ జియోమార్ట్	1,000
వేదాంతు	1,109	షేర్‌చాట్	700
కార్స్24	600	డంజో	650
ఎంఫైన్	600	1కే కిరాణా	600
ఓయో	600	స్కిల్-లింక్	600
ఉడాన్	530	ఫ్రంట్‌రో	550

ఆగని కొలువుల కోత

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): ఉద్యోగాల కోత ఫార్మా, టెలి కమ్యూనికేషన్, ఈ-కామర్స్, ఫైనాన్స్, విమాన యానం, డెలివరీ, ఎడ్‌టెక్, ట్రావెల్స్, మార్కెటింగ్ ఇలా అన్ని రంగాలకూ విస్తరించింది. దేశీయ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ 1,400 మంది ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. అమెరికాకు చెందిన కమ్యూనికేషన్స్ సంస్థ సిస్కో వేలాదిమందిని తొలగించ బోతున్నది.

కోతల్లో నంబర్ 2 మనమే

గడిచిన రెండేండ్లుగా టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత పెరిగిపోయింది. ముఖ్యంగా 2023ను ఉద్యోగుల తొలగింపునామ సంవత్సరంగా పిలిచారు. కారణం.. ఆ ఒక్క ఏడాదే ప్రపంచవ్యాప్తంగా 2.62 లక్షల మంది టెక్ ఉద్యోగులు తమ కొలువులను కోల్పోయారు. ఇందులో 70 శాతం కోతలతో అమెరికా తొలిస్థానంలో ఉండగా, తర్వాతి స్థానంలో భారత్ నిలిచింది. ఆ ఏడాది భారత్‌లో 18 వేల టెక్ ఉద్యోగాలు గాయబ్ అయ్యాయి. ఈ మేరకు లేఆఫ్-ఫై వెబ్‌సైట్ తన నివేదికలో వెల్లడించింది. ఇక, ఈ ఏడాది కూడా ఉద్యోగాల కోతలు తారాస్థాయికి చేరనున్నట్టు అంచనాలు వెలువడుతున్నాయి.

ఉద్యోగాల కోతలు — గడిచిన ఐదేండ్లలో భారత్‌లో టెక్ రంగంలోని ఉద్యోగుల తొలగింపు (ఫిబ్రవరి 9నాటికి)



గడిచిన మూడేండ్లలో ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలోని ఉద్యోగుల తొలగింపు (ఫిబ్రవరి 9నాటికి)



సోమవారం ఢిల్లీ సరిహద్దు సింఘూ వద్ద పోలీసులు భారీగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

హస్తినలో హైటెన్షన్

నేడే రైతుల 'ఢిల్లీ చలో' మార్చ్

రాజధానిలో భద్రత కట్టుదిట్టం.. నెల రోజుల పాటు 144 సెక్షన్

రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా సరిహద్దుల్లో బారికేడ్లు, కంచెలు

పంజాబ్‌తో సరిహద్దులను మూసివేసిన హర్యానా సర్కార్

భోపాల్ రైల్వేస్టేషన్‌లో 100 మంది కర్ణాటక రైతుల అరెస్టు

న్యూఢిల్లీ/చండీగఢ్, ఫిబ్రవరి 12: కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కి చట్టబద్ధత కల్పించడంతోపాటు పలు ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం రైతు సంఘాలు మంగళవారం నిర్వహించ తలబెట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్‌తో రాజధాని హస్తినలో హైటెన్షన్ వాతావరణం నెలకొన్నది. నూతన సాగు చట్టాలకు వ్యతిరేకంగా 2020-21 మధ్య ఏడాదికి పైగా సాగిన రైతుల ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఢిల్లీలో ఏకంగా నెల రోజులపాటు 144 సెక్షన్ విధిస్తున్నట్టు ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎక్కువ మంది గుమిగూడటం, ర్యాలీలు చేయడం, సమావేశాలు నిర్వహించడం, బ్యానర్లు ప్రదర్శించడం, నినాదాలు చేయడం, జనాలను ఎక్కించుకొని ట్రాక్టర్లతో ఢిల్లీలోకి ప్రవేశించడంపై నిషేధం విధించారు. అలాగే ఇటుకలు, రాళ్లు, యాసిడ్ వంటి ప్రమాదకరమైన ద్రవ పదార్థాలు, పెట్రోల్, సోడా నీళ్ల బాటిళ్లు వంటి వాటిని వెంట తీసుకురావడంతోపాటు లౌడ్‌స్పీకర్ల వినియోగంపైనా నిషేధించారు. రైతుల ఆందోళన దృష్ట్యా ఢిల్లీ, చండీగఢ్‌లలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

సింఘూ, టిక్రి, ఘాజీపూర్ సరిహద్దుల్లో నిఘా

రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకొనేందుకు సింఘూ, టిక్రి, ఘాజీపూర్ సరిహద్దుల ప్రవేశ పాయింట్ల వద్ద సిమెంట్ బారికేడ్లు, ఇనుప కంచెలు, మేకులు, కంటెయినర్లతో బహుళ అంచెల బారికేడ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు పరిస్థితిని సమీక్షించేందుకు సింఘూ సరిహద్దు వద్ద ఒక తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేశారు. హర్యానాతో సరిహద్దులు పంచుకొనే గ్రామీణ రహదారులను మూసివేశారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతాలపై నిఘా ఉంచేందుకు డ్రోన్లను కూడా వినియోగిస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు. పంజాబ్ సరిహద్దుల్లోని అంబాలా, జింద్, ఫతేబాద్, కురుక్షేత్ర, సిర్సా జిల్లాల్లో బారికేడ్లు, ఇనుప కంచెలు ఏర్పాటు చేసింది.

పలు రాష్ట్రాల నుంచి బయలుదేరిన రైతులు

200కు పైగా రైతు సంఘాలు 'ఢిల్లీ చలో' మార్చ్‌లో పాల్గొంటాయని రైతు నేతలు ప్రకటించారు. సంయుక్త కిసాన్ మోర్చాలో భాగంగా ఉన్న బీకేయూ(దోబా) ఈ ఆందోళనకు మద్దతు ప్రకటించింది. 'ఢిల్లీ చలో' ర్యాలీలో పాల్గొనేందుకు ఇప్పటికే పంజాబ్, హర్యానా పలు ఇతర రాష్ట్రాల నుంచి రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో బయలుదేరారు. డిమాండ్ల సాధనకు కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ర్యాలీగా ఢిల్లీ చేరుకొని.. అనంతరం మంగళవారం పార్లమెంట్ భవనం వెలుపల ఆందోళన చేపట్టనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ప్రకటించాయి.

ఢిల్లీ చేరుకొంటున్న రైతుల అరెస్టు

కర్ణాటక నుంచి వస్తున్న దాదాపు 100 మంది రైతులను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఢిల్లీకి వెళ్తున్న రైలు నుంచి దింపేయటంతో రైతులు అక్కడే ఆందోళనకు దిగారు. పోలీసుల చర్యల్లో ఒకరికి గాయాలయ్యాయని ఎస్కేఎం దక్షిణ భారత కన్వీనర్ శాంతకుమార్ తెలిపారు. కర్ణాటక, మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న చాలా మంది రైతులను అడ్డుకొంటున్నారని ఎస్కేఎం నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల అరెస్టులను ఏఐకేఎస్ ఖండించింది.

నిఘా సమాచారంతో అప్రమత్తం

పంజాబ్, హర్యానా, యూపీ, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి దాదాపు 20 వేల మంది రైతులు ఢిల్లీకి వచ్చే అవకాశం ఉన్నదని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీలోకి ఎలా చేరుకోవాలన్న దానిపై ఇప్పటికే రైతు సంఘాలు 40 సార్లు రిహార్సల్స్ నిర్వహించాయని తెలిపాయి.

రాజ్యసభకు సోనియా?

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చని తెలుస్తున్నది. రాజ్యసభ ఎన్నికలకు పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు సోమవారం పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. సోనియాగాంధీ, పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ రాజ్యసభకు పోటీ చేసే అవకాశం ఉన్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్ నుంచి ఖాళీ అయ్యే స్థానం నుంచి పోటీలో సోనియాగాంధీ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. 15 రాష్ట్రాల్లోని 56 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల జరుగనున్నాయి. కానీ ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించలేదు. ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్నది ఇంకా తేలనప్పటికీ సోనియా మాత్రం ఈ సారి రాజ్యసభకు ఎన్నికవుతారని సమాచారం.

తమిళ నాడులో మళ్లీ గవర్నర్ X సర్కార్

చెన్నై: తమిళనాడు సర్కారు, గవర్నర్ మధ్య బడ్జెట్ ప్రసంగంపై ఈ సారి కూడా వివాదం రేగింది. తప్పుదోవ పట్టించే అంశాలు ఉన్నాయని పేర్కొంటూ ప్రసంగ పాఠం పూర్తిగా చదవడానికి గవర్నర్ నిరాకరించారు. అలాగే సమావేశాలకు ముందు, తర్వాత జాతీయ గీతాన్ని ఆలపించాలని గవర్నర్ డిమాండ్ చేయగా, సభ సంప్రదాయాలు, నిబంధనలకు ఇది అనుగుణంగా లేదని ప్రభుత్వం పేర్కొన్నది. ఈ క్రమంలో కొన్ని నిమిషాలు మాత్రమే ప్రసంగించి గవర్నర్ సభను వీడారు.

రేషన్ షాపుల్లో ప్రధాని ఫొటోలు పెట్టం: విజయన్

తిరువనంతపురం: రేషన్ షాపుల్లో ప్రధాని మోదీ ఫొటోలు కలిగిన సైన్ బోర్డులు, ఫ్లెక్స్-బ్యానర్లు ఉంచాలన్న కేంద్రం మార్గదర్శకాలను అమలు చేయలేమని కేరళ సర్కారు తేల్చి చెప్పింది. సోమవారం అసెంబ్లీలో ఒక ప్రశ్నకు ఆ రాష్ట్ర సీఎం విజయన్ ఈ విధంగా స్పందించారు. 'లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఇలాంటి ప్రచారం చేయమనడం వారి(బీజేపీ) ఎన్నికల ప్రచారంలో భాగమే. దీనిపై మేం కేంద్రాన్ని ప్రశ్నిస్తాం. ఎన్నికల సంఘాన్ని సంప్రదించే ఆలోచన చేస్తాం' అని విజయన్ అన్నారు.

ఫరూక్ అబ్దుల్లాకు మళ్లీ ఈడీ సమన్లు

శ్రీనగర్/న్యూఢిల్లీ: నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లాకు మనీ లాండరింగ్ కేసులో ఈడీ సోమవారం సమన్లు జారీ చేసింది. మంగళవారం తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని కోరింది. ఈ కేసులో జనవరి 11న అబ్దుల్లాకు సమన్లు జారీ చేసినా ఆయన విచారణకు హాజరు కాలేదు. తాజా సమన్లకు కూడా ఫరూక్ స్పందించరని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. జమ్ము కశ్మీర్ క్రికెట్ సంఘం నిధుల పంపకంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ 2012లో ఫరూక్ అబ్దుల్లాపై ఈడీ కేసు నమోదు చేసింది. 2018లో సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్ ఆధారంగా ఈడీ ఈ కేసును రిజిస్టర్ చేసింది.

డిప్యూటీ సీఎంల నియామకం రాజ్యాంగ విరుద్ధం కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాలు ఉపముఖ్యమంత్రులను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ప్రభుత్వాలు తమ వెసులుబాటు కోసం డిప్యూటీ సీఎంలను నియమించుకోవడం రాజ్యాంగ ఉల్లంఘన కాదని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. పబ్లిక్ పొలిటికల్ పార్టీ వేసిన పిల్‌పై సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. 'డిప్యూటీ సీఎం క్యాబినెట్ హోదాలోనే ఉంటారు. అయితే రాష్ట్రప్రభుత్వానికి వారు మొదటి, ముఖ్యమైన మంత్రిగా వ్యవహరిస్తారు. ఇది రాజ్యాంగ విరుద్ధం కాదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

'ఎక్స్'కు పోటీగా 'బ్లూస్కై'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్)కు ప్రత్యామ్నాయంగా మరో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ పుట్టుకొచ్చింది. 'బ్లూస్కై' పేరుతో ట్విట్టర్ మాజీ సీఈవో జాక్ డోర్సీ ఈ సామాజిక మాధ్యమాన్ని అందుబాటులోకి తెచ్చారు. అకౌంట్ పోర్టబిలిటీ లాంటి వినూత్న ఫీచర్లను ఆఫర్ చేస్తున్న 'బ్లూస్కై' ఒక రకంగా ఎక్స్‌కు ప్రతిరూపమే. దాదాపు ఎక్స్ మాదిరిగానే పని చేసే 'బ్లూస్కై'కి సొంత ప్రత్యేకత ఉన్నది. 'లేబులింగ్ సర్వీస్' లాంటి ఫీచర్‌ను ప్రవేశపెట్టాలని ఈ ప్లాట్‌ఫామ్ యోచిస్తున్నది. కంటెంట్‌ను మోడరేట్ చేసేందుకు కస్టమర్లు, సంస్థలు లేబుల్స్‌ను రూపొందించుకునేందుకు ఈ ఫీచర్ అనుమతిస్తుంది.

ఫేక్ 'ఎక్స్' ఖాతాలపై సీబీఎస్ఈ హెచ్చరిక

న్యూఢిల్లీ: ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్న నకిలీ ఎక్స్ (గతంలో ట్విటర్) ఖాతాలపై సీబీఎస్ఈ హెచ్చరిక జారీ చేసింది. తన అధికారిక ఎక్స్ అకౌంట్ కేవలం '@సీబీఎస్ఈ ఐఎన్‌డీఐఏ29' మాత్రమేనని తెలిపింది. సుమారు 30 ఎక్స్ ఖాతాలు సీబీఎస్ఈని పోలి ఉన్నాయని సోమవారం ట్వీట్ చేసింది. ఇవి సీబీఎస్ఈ పేరు, లోగోలను వాడుకుంటున్నాయని పేర్కొన్నది. '@సీబీఎస్ఈ అఫిషియల్'. '@సీబీఎస్ఈబోర్డ్', '@సీబీఎస్ఈన్యూస్ఇండియా' తదితర సైట్లు తమవి కాదని వెల్లడించింది.

కాంగ్రెస్‌కు మహారాష్ట్ర మాజీ సీఎం

అశోక్ చవాన్ గుడ్‌బై

- ఎమ్మెల్యే పదవికి, ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా
- లోక్‌సభ ఎన్నికల ముంగిట హస్తానికి గట్టి ఎదురుదెబ్బ
- ఇప్పటికే పార్టీని వీడిన మిలింద్ దేవ్‌రా, బాబా సిద్ధిఖీ

ముంబై, ఫిబ్రవరి 12: లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ సోమవారం కాంగ్రెస్ పార్టీని వీడారు. చవాన్ బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారనే ఊహాగానాల మధ్య ఈ పరిణామం చోటు చేసుకున్నది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటేల్‌కు రాసిన లేఖలో చవాన్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఆ పత్రాన్ని అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌కు సమర్పించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలు బాబా సిద్ధిఖీ, మిలింద్ దేవరా పార్టీని వీడిన కొన్ని రోజులకే చవాన్ కాంగ్రెస్‌ను వీడడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విలేకరులతో మాట్లాడుతూ ఆగే ఆగే దేఖో హోతా హై క్యా.. ముందు ముందు ఏం జరుగుతుందో చూడండి.. అని అన్నారు. చవాన్ మరాఠ్వాడా ప్రాంతంలోని నాందేడ్ జిల్లాకు చెందిన వారు. ఆయన తండ్రి దివంగత శంకర్‌రావ్ చవాన్ కూడా మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2010లో ముంబైలోని ఆదర్శ్ హౌసింగ్ స్కాంలో ప్రమేయం ఉండటంతో అశోక్ చవాన్ ముఖ్యమంత్రి పదవిని కోల్పోయారు. 2014-19 మధ్య మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా చవాన్ బాధ్యతలు నిర్వర్తించారు.

రెండు రోజుల్లో కార్యాచరణ: అశోక్ చవాన్

రాజీనామా అనంతరం చవాన్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ లో జరుగుతున్న వాటి గురించి బహిరంగ వేదికపై తాను మాట్లాడనని చెప్పారు. తన రాజకీయ భవిష్యత్తు గురించి రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని అన్నారు. బీజేపీలో చేరుతారా? అన్న ప్రశ్నకు తానింకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని బదులిచ్చారు. కాంగ్రెస్‌ని వీడటం తన వ్యక్తిగత నిర్ణయమని, అందుకు కారణాలు చెప్పదల్చుకోలేదన్నారు. బీజేపీ కాంగ్రెస్ ఆక్రమిత పార్టీగా మారబోతున్నదని శివసేన (యూబీటీ) నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. 2024లో తమ పార్టీ 400 సీట్లు గెలుచుకుంటుందని ప్రధాని మోదీ ఘంటాపథంగా చెబుతున్నప్పుడు ఇతర పార్టీలను ఎందుకు విచ్ఛిన్నం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. దేశంలో బీజేపీ ఏం చేస్తున్నదో ప్రజలు గమనిస్తున్నారని ఠాక్రే అన్నారు.

బలపరీక్షలో నెగ్గిన నితీశ్

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకున్నారు. సోమవారం ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానానికి 129 మంది ఎమ్మెల్యేలు మద్దతు పలికారు. ఇందులో ముగ్గురు ఆర్జేడీ ఎమ్మెల్యేలు ఉండటం గమనార్హం. విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మొత్తం 243 సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో మెజార్టీ మార్క్ 122. అంతకుముందు ఆర్జేడీకి చెందిన అసెంబ్లీ స్పీకర్ అవధ్ బీహారి చౌదరీని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. 125-112 ఓట్లతో తీర్మానం నెగ్గింది. విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ, 'నితీశ్ ఎన్డీయే కూటమిలో చేరడానికి కారణాలు ఏంటన్నది బీహార్ ప్రజలకు వివరించాలి' అని అన్నారు. ఆ తర్వాత సీఎం నితీశ్ కుమార్ మాట్లాడుతూ, గతంలో ఆర్జేడీ ప్రభుత్వం రాష్ట్రంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని, లాలూ సీఎంగా ఉండగా రాష్ట్రంలో మత కల్లోలాలు జరిగాయని ఆరోపించారు.

బీజేపీతో ఆర్ఎల్డీ దోస్తీ

- ఎన్డీయే కూటమిలో చేరుతున్నట్టు ప్రకటించిన పార్టీ చీఫ్ జయంత్
- లోక్‌సభ ఎన్నికల వేళ విపక్ష ఇండియా కూటమికి మరో షాక్

లక్నో, ఫిబ్రవరి 12: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమికి మరో షాక్ తగిలింది. ఇప్పటికే బీహార్ సీఎం, జేడీయూ నేత నితీశ్ కూటమి నుంచి బయటకు వెళ్లిపోగా.. తాజాగా ఆ జాబితాలో మరో పార్టీ రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్డీ) చేరింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరుతున్నట్టు ఆర్ఎల్డీ పార్టీ అధినేత జయంత్ చౌదరి సోమవారం ప్రకటించారు. జయంత్ చౌదరి తాత, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారత రత్న ప్రకటించిన నేపథ్యంలో ఆర్ఎల్డీ ఎన్డీయేలో చేరనున్నదనే ప్రచారం విస్తృతంగా జరిగిన విషయం తెలిసిందే. జయంత్ చౌదరి సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, అతి తక్కువ సమయంలోనే ఈ నిర్ణయం తీసుకొన్నామని తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో చర్చించిన తర్వాతనే ఎన్డీయేలో చేరిక నిర్ణయం తీసుకొన్నామని పేర్కొన్న జయంత్ చౌదరి.. దీని వెనుక 'పెద్ద ప్లానింగ్' ఏమీ లేదన్నారు. ప్రజలకు మంచి చేయాలని అనుకొంటున్నామని అన్నారు. ఎన్డీయేలో ఆర్ఎల్డీ చేరికపై పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు స్పందించారు.

పశ్చిమ యూపీలో ఆర్ఎల్డీకి బలం

రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీకి పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో పట్టు ఉన్నది. రైతుల్లో బలమైన మద్దతు ఉన్నది. ఆర్ఎల్డీ పార్టీకి జాట్లు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్నారు. యూపీలోని దాదాపు ఏడు లోక్‌సభ స్థానాల్లో వీరి ప్రభావం ఉంటుంది. ఈ నేపథ్యంలో పశ్చిమ యూపీలో ఆర్ఎల్డీకి కొన్ని సీట్లు కేటాయించడంతో పాటు ఆ పార్టీతో పొత్తు తమకు కొంతమేర లాభించే అవకాశం ఉన్నదని బీజేపీ భావిస్తున్నది. మొదట బీజేపీతో పొత్తులో ఉన్న ఆర్ఎల్డీ.. ఆ తర్వాత సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌తో కూడా జట్టు కట్టింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఆర్ఎల్డీ ఏడు సీట్లు పోటీ చేసేలా ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్ఎల్డీ అధినేత జయంత్ చౌదరి ప్రాథమిక అవగాహనకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే తన తాజా నిర్ణయంతో జయంత్ చౌదరి అఖిలేశ్‌కు ఝలక్ ఇచ్చినట్టు అయింది.

దౌత్య విజయం

- ఖతార్‌తో ఫలించిన భారత్ చర్చలు
- 8 మంది నేవీ మాజీ అధికారులకు గూఢచర్యం కేసు నుంచి విముక్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: గూఢచర్యం ఆరోపణలపై ఖతార్‌లో అరెస్ట్ అయిన 8 మంది భారత నావికాదళ మాజీ అధికారులకు విముక్తి లభించింది. వారి శిక్షను ఖతార్ ప్రభుత్వం రద్దు చేసి విడుదల చేసింది. వీరిలో ఏడుగురు సోమవారం ఉదయం భారత్ చేరుకున్నారు. గూఢచర్యం కేసులో మూడున్నర నెలల క్రితం ఖతార్ కోర్టు వీరికి తొలుత మరణ శిక్ష విధించింది. అయితే భారత ప్రభుత్వ దౌత్య ప్రయత్నాలు ఫలించి వారు విడుదలయ్యారు. మొదట విదేశాంగ మంత్రి జైశంకర్ పలుమార్లు ఖతార్ అధికారులతో చర్చలు జరిపారు. మరోవైపు తెర వెనుక జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా పలుమార్లు దోహా వెళ్లి మాజీ నేవీ అధికారుల విడుదల విషయమై ఖతార్ అధికారులతో చర్చలు జరిపారు. ఈ కేసు విషయంలో ప్రధాని నరేంద్రమోదీ వ్యక్తిగత చొరవ తీసుకున్నట్టు విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా తెలిపారు. 13, 14 తేదీల్లో యూఏఈలో పర్యటించనున్న ప్రధాని మోదీ.. 14న ఖతర్ రాజధాని దోహా చేరుకుని ఎమిర్ ఆఫ్ ఖతార్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని వెల్లడించారు. భారత మాజీ నేవీ అధికారుల విడుదల వేళ ప్రధాని ఖతార్‌లో పర్యటించనుండటం గమనార్హం.

స్వదేశానికి చేరుకున్న భారత నౌకాదళ మాజీ అధికారులు

కృతజ్ఞతలు తెలిపిన భారత్

భారత అధికారులను విడుదల చేస్తూ ఖతార్ తీసుకున్న నిర్ణయానికి భారత విదేశాంగ శాఖ కృతజ్ఞతలు తెలిపింది. దాహ్రా గ్లోబల్ కంపెనీలో పనిచేస్తూ గూఢచర్యం ఆరోపణలపై శిక్ష అనుభవిస్తున్న వారిలో మాజీ కెప్టెన్లు నవ్‌తేజ్ గిల్, సౌరభ్ వశిష్ట్, కమాండర్లు పూర్ణేందు తివారీ, అమిత్ నాగ్‌పాల్, ఎస్‌కే గుప్తా, బీకే వర్మా, సుగుణాకర్ పాకాల, సెయిలర్ రాగేశ్ ఉన్నారు. పెండింగ్ పేపర్ వర్క్ కారణంగా తివారీ ఒక్కరే ఇంకా స్వదేశానికి చేరుకోలేదు. గూఢచర్యం ఆరోపణలపై గత ఏడాది అక్టోబరు 26న ఖతార్ కోర్టు వీరికి మరణ దండన విధించగా భారత ప్రభుత్వం దౌత్యపరంగా ఖతార్‌పై ఒత్తిడి తేవడంతో అక్కడికి కోర్టు అప్పీలుకు అవకాశం ఇచ్చింది. విచారణ అనంతరం డిసెంబర్ 28న మరణ శిక్షను జైలుశిక్షగా మారుస్తూ మూడేండ్ల నుంచి 25 ఏండ్ల వరకు జైలు శిక్ష విధించింది. ఆ తర్వాత కూడా భారత ప్రభుత్వం వారిని విడిపించడానికి పట్టు వదలకుండా ప్రయత్నించడంతో వీరికి ఎట్టకేలకు స్వేచ్ఛ లభించింది.

59 వేల మంది భారతీయులకు అమెరికా పౌరసత్వం

గత ఏడాది మంజూరు చేసిన బైడెన్ సర్కారు

న్యూయార్క్, ఫిబ్రవరి 12: అమెరికా పౌరసత్వం పొందుతున్న వారిలో భారతీయులు అగ్రభాగాన ఉన్నారు. 2023 సంవత్సరంలో అత్యధిక అమెరికా పౌరసత్వాలు పొందిన రెండో దేశంగా భారత్ నిలిచింది. గత ఏడాది అమెరికా 8,78,500 మందికి కొత్తగా పౌరసత్వం జారీచేసింది. వీరిలో 59,100 మంది భారతీయులు ఉన్నట్టు అమెరికా పౌరసత్వ, వలసల సేవా విభాగం (యూఎస్ సీఐఎస్) తాజా వార్షిక నివేదికలో వెల్లడించింది. గత ఏడాది మొత్తంగా అమెరికా పౌరసత్వం పొందిన విదేశాలకు చెందిన వారిలో 6.7 శాతం మంది భారతీయులే ఉండటం గమనార్హం. ఈ జాబితాలో 1.1 లక్షల పౌరసత్వాలతో మెక్సికో మొదటి స్థానంలో నిలిచింది. మూడు, నాలుగు స్థానాల్లో ఫిలిప్పీన్స్, డొమినిక్ రిపబ్లిక్ నిలిచాయి. ఒక విదేశీ వ్యక్తి అమెరికా పౌరుడు కావాలంటే ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టంలోని నిబంధనలకు అర్హత సాధించాల్సి ఉంటుంది. ఒక వ్యక్తికి అమెరికా పౌరసత్వం జారీ చేయాలంటే అంతకుముందు అతను ఐదేండ్ల పాటు ఆ దేశంలో చట్టబద్ధమైన నివాసిగా ఉండాల్సి ఉంటుంది.